క్లుప్తంగా

మురుగు తొలగించారు



శుభ్రం చేస్తున్న సిబ్బంది

సాక్షి స్పందన

ఓదెల: మండలంలోని కొలనూర్‌లోని రెండోవార్డులో ఇళ్ల మధ్యలో నిలిచిన మురుగు గురించి 'కాలువ నిండా మురుగే' అనే శీర్షికతో గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి కార్యదర్శి శ్రీనివాస్ స్పందించారు. జేసీబీతో కాలువను శుభ్రం చేయించారు. వార్డు ప్రజలు, గ్రామస్తులు కార్యదర్శికి, 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలి

జూలపల్లి: విద్యార్థినులు ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి సూచించారు. మండలంలోని పెద్దాపూర్ ఆదర్శ విద్యాలయంలో గురువారం విద్యార్థినులకు వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అనంతరం విద్యాలయంలో మెస్ పరిశీలించారు. మొక్కలు నాటారు. ఆర్‌ఎస్‌బీకే వైద్యులు డాక్టర్ రత్నాకర్, హెచ్‌వీ వసంత, సూపర్‌వైజర్, కలీమొద్దీన్, ప్రిన్సిపాల్ పద్మశ్రీ, ఏఎన్‌ఎంలు అనంతరావ్, రుక్మిణి పాల్గొన్నారు.

పీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

పెద్దపల్లిరూరల్: కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం చేసిందంటూ కాంగ్రెస్ నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని బీజేపీ దళితమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె సదానందం అన్నారు. పెద్దపల్లిలో గురువారం ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రాష్ట్రంలో రైల్వేల ఆధునికీకరణకు కేంద్రం ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. నాయకులు క్రాంతికుమార్, రాజవీరు, మంథెన కృష్ణ, కుమార్, విజయకుమార్, ముస్త్యాల సంతోష్, రవి, సందీప్ ఉన్నారు.

40 బెంచీలు బహూకరణ



బెంచీలు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

గోదావరిఖనిటౌన్: స్థానిక శారదానగర్‌లోని శ్రీసరస్వతి శిశు మందిర్ పాఠశాలలో చదివిన 1993–94 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు పాఠశాలకు రూ.1.37లక్షల విలువ గల 40 బెంచీలను గురువారం పాఠశాలకు అందజేశారు. పూర్వ విద్యార్థులు కట్ట శ్రీధర్, మోసం రవి, మీస సతీశ్, బర్ల కృష్ణ, టి.సురేశ్, ఇ.సమ్మయ్య, ఇ.కనకరాజు, ఎం.శ్రీనివాస్, పాఠశాల సమితి అధ్యక్షులు బంక రామస్వామి, గంగాడి భగవాన్‌రెడ్డి, కోశాధికారి రఘుసింగ్, ప్రధానాచార్యులు ఎర్రం రాజు ఉన్నారు.

లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయం



మాట్లాడుతున్న ఆర్డీవో హనుమానాయక్

కమాన్‌పూర్: కమాన్‌పూర్ లయన్స్ క్లబ్ ప్రజలకు చేస్తున్న సేవలు అభినందనీయమని మంథని ఆర్డీవో హనుమానాయక్ కొనియాడారు. మండలంలోని జూలపల్లిలో క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్డీవో మాట్లాడుతూ ఏడాదిలోనే ఉత్తమ క్లబ్‌గా ఎంపికావడం అభినందనీయమన్నారు. ప్రజలకు క్లబ్ ఆధ్వర్యంలో మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సానా రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ ఆరిఫొద్దిన్, పీఏసీఎస్ చైర్మన్ ఇనగంటి భాస్కర్‌రావు, నల్లవెల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మాఫీ రుణాలను తిరిగి ఇవ్వాలి

ఎలిగేడు: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రూ.లక్షలోపు రుణాలను మాఫీ చేసినందున మాఫీ అయిన రైతులకు తిరిగి రుణాలను వెంటనే ఇవ్వాలని వ్యవసాయశాఖ ఏడీఏ కాంతారావు అన్నారు. మండల కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయాన్ని గురువారం ఏడీఏ సందర్శించి రైతుల రుణమాఫీపై, క్రాప్‌లోన్ల రెన్యువల్ గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మాఫీ అయిన రైతులకు త్వరగా రుణాలు మంజూరు చేయాలని కోరారు. ఏడీఏ వెంట సహకార సంఘం సీఈవో కౌెట్టి విక్రమ్, ఏఈవో గణేశ్, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

న్యూమారేడుపాకకు జ్వరమొచ్చింది



ఒకే ఇంట్లో జ్వరంతో బాధపడుతున్న అనిల్, సందీప్



జ్వరంతో బాధపడుతున్న మహిళ

- గ్రామంలో 200 మందికిపైగా బాధితులు
- 15 రోజులైనా తగ్గని వైనం
- మెడికల్ క్యాంపులు నిర్వహించాలని వినతి

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి ప్రభావిత గ్రామమైన రామగుండం కార్పొరేషన్ 19వ డివిజన్ న్యూమారేడుపాకలోని ప్రజలను జ్వరాలు వణికిస్తున్నాయి. గ్రామంలోని ప్రతీ ఇంట్లో ఒకరు లేదా ఇద్దరు జ్వరంతో బాధపడుతున్నారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ప్రస్తుతం గ్రామంలోని ఎస్సీ కాలనీ, బీసీ కాలనీ, గోపాల్‌నగర్, రెడ్డి కాలనీ ఏరియాల్లో దాదాపు 200 మందికి పైగా జ్వర బాధితులు ఉన్నారు. ఒకే ఇంట్లో తల్లి, కూతురు, కుమారుడు, చిన్నారులు ఇలా చాలా మంది టైఫాయిడ్, చికెన్ గున్యా, మలేరియా వంటి తదితర సీజనల్ వ్యాధులతో బాధపడుతున్నారు. కొంత మంది ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకుంటున్నారు.

ఎవరూ పట్టించుకోవడం లేదు

సింగరేణి యజమాన్యం, ప్రభుత్వ వైద్యాధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో సింగరేణి ఆర్జీ–2 ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపులు నిర్వహించేది. కానీ ఈమధ్య కాలంలో మెడికల్ క్యాంపుల నిర్వహణ తగ్గిపోయిందని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా సింగరేణి అధికారులు, ప్రభుత్వ వైద్య సిబ్బంది అధికారులు స్పందించి గ్రామంలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

15రోజులైనా తగ్గడం లేదు



కరీంనగర్‌లో ఓ ప్రైవేట్ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాను. 20 రోజుల క్రితం నా సొంత గ్రామమైన న్యూమారేడుపాకకు వచ్చిన ఐదురోజులకు జ్వరం వచ్చింది. ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నాను. 15రోజులు గడిచినా జ్వరం తగ్గడం లేదు. వైద్యులు గ్రామంలో ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహించాలి. – రాకేశ్, న్యూమారేడుపాక

మెడికల్ క్యాంపులు నిర్వహించాలి

సింగరేణి ప్రభావిత గ్రామమైన న్యూమారేడుపాకలో చాలా మంది రోగాల బారిన పడుతున్నారు. ఆర్జీ–2 ఏరియా సింగరేణి యజమాన్యం వెంటనే ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహించి వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి.అలాగే ప్రభుత్వ వైద్యసిబ్బంది సైతం గ్రామంలో పర్యటించి జ్వర సర్వే చేపట్టి వైద్య శిబిరాలు నిర్వహించాలి. – తాళ్ల అమృత రాజయ్య, డివిజన్ కార్పొరేటర్

పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలి



మొక్క నాటుతున్న మేయర్ అనిల్‌కుమార్, జీఎం చింతల శ్రీనివాస్

గోదావరిఖని: పర్యావరణ సమతుల్యం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని మేయర్ బంగి అనిల్ కుమార్, ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ కోరారు. ఆర్జీ–1 ఏరియాలోని మూసివేసిన మేడిపల్లి ఓసీపీ డంప్‌యార్డులో గురువారం మొక్కలు నాటారు. కోల్‌బెల్ట్ ప్రాంతంలో పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. సేవా అధ్యక్షురాలు చింతల లక్ష్మి, సీఎంవోఏఐ నాయకులు శ్రీనివాస్, ఎస్‌వోటూ జీఎం రామ్మోహన్, ఏజీఎం పర్సనల్ లక్ష్మీనారాయణ, ఏరియా సేఫ్టీ అధికారి బైద్య, ఎన్విరాన్‌మెంట్ అధికారి ఆంజనేయప్రసాద్, ప్రాజెక్ట్ అధికారి చంద్రశేఖర్, ఏజెంట్ శ్రీనివాస్, మల్లికార్జున్‌యాదవ్, అభిలాష్, వర్క్‌షాప్ డీజీఎం జితేందర్‌సింగ్, డీవైఎస్‌ఈ వరప్రసాద్ పాల్గొన్నారు.

'కాంగ్రెస్ కుట్రలు బట్టబయలు చేసేందుకే'



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలను బట్టబయలు చేసేందుకు బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం మేడిగడ్డ బ్యారేజీ సందర్శించేందుకు వస్తున్నారని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తెలిపారు. స్థానిక ప్రధాన చౌరస్తాలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రానికి తాగు, సాగు, పరిశ్రమలకు నీటిలోటు ఉండకూడదని, జలకళతో రాష్ట్రం సస్యశ్యామలంగా ఉండాలని మాజీ సీఎం కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారన్నారు. ప్రాజెక్టుపై కాంగ్రెస్ అబద్ధపు ప్రచారం చేస్తోందని ఆరోపించారు. అబద్ధపు ప్రచారాలను పటాపంచలు చేస్తూ కేటీఆర్ నేతృత్వంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కన్నెపల్లి పంపుహౌస్, మేడిగడ్డ బ్యారేజ్‌లను సందర్శించనున్నట్లు పేర్కొన్నారు. మేడిగడ్డకు బయలుదేరే సమయంలో ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్ వద్ద ఘన స్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులంతా తరలిరావాలని కోరారు. సమావేశంలో నాయకులు మారుతి, నూతి తిరుపతి, బొడ్డు రవీందర్, చెలకలపల్లి శ్రీనివాస్, జక్కుల తిరుపతి, అచ్చె వేణు, కల్వచర్ల కృష్ణవేణి, ముద్దసాని సంధ్యారెడ్డి పాల్గొన్నారు.

ఉచిత ప్రమాదబీమాపై అవగాహన

గోదావరిఖని: సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు రూ.30లక్షల ప్రమాదబీమా వర్తింపుపై గురువారం ఆర్జీ–2 ఏరియా కమ్యూనిటీ హాలులో అవగాహన సదస్సు నిర్వహించారు. హెచ్‌డీఎఫ్‌సీ గోదావరిఖని బ్రాంచ్ మేనేజర్ సీహెచ్ శ్రీనివాస్ ఉచిత ప్రమాద బీమాపై ఉన్న అనుమానాలు, సందేహాలను నివృత్తి చేశారు. కాంట్రాక్టు ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థిక భద్రతను కల్పించేందుకు ఉచిత ప్రమాద బీమా సదుపాయం కల్పిస్తున్నట్లు వివరించారు. బ్యాంకులో శాలరీ అకౌంట్ కలిగిన ప్రతీ కాంట్రాక్ట్ ఉద్యోగికి ఇది అమలు చేయనున్నట్లు తెలిపారు. కాంట్రాక్టు కార్మికుల ఆర్థిక భద్రత చర్యల్లో భాగంగా అమలు చేస్తున్నట్లు ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ పేర్కొన్నారు. కార్యక్రమంలో పర్సనల్ డీజీఎం రాజేంద్రప్రసాద్, సివిల్ డీజీఎం ధనుంజయ, ఇఇ ప్రతాపగిరి రాజు, డీవైపీఎం వేణుగోపాల్, జేఈ సివిల్ రాధాకృష్ణ, కాంట్రాక్టు ఉద్యోగులు పాల్గొన్నారు.

కాలువ పూడికతీత పనులు ప్రారంభం

రామగిరి: మండలంలోని బేగంపేట డి–83 కెనాల్ పూడికతీత పనులను గురువారం ప్రారంభించారు. పంటపొలాలకు కాలువ నీరు సరిగా అందడంలేదని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల తిరుపతియాదవ్ మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి సూచన మేరకు తిరుపతియాదవ్ కాలువ పూడికతీత పనులు నిర్వహించాలని ఆర్జీ–3 జీఎం సుధాకర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆర్జీ–3 జీఎం యంత్రాన్ని పంపించి ఎస్సారెస్పీ డి–83 కెనాల్‌లో పనులు ప్రారంభించారు.

సంక్షిప్త వార్తలు

వనమహోత్సవంపై శ్రద్ధచూపాలి

పెద్దపల్లిరూరల్: గ్రామాల్లో పారిశుధ్యం, వనమహోత్సవ కార్యక్రమాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని మండల ప్రత్యేకాధికారి, ఆర్డీఓ గంగయ్య అన్నారు. పెద్దపల్లి మండలం రాఘవాపూర్, రంగాపూర్, సబ్బితం గ్రామాల్లో గురువారం అవెన్యూ ప్లాంటేషన్‌ను పరిశీలించి ఉపాధి కూలీలకు పలు సూచనలిచ్చారు. రాఘవాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆవరణతో పాటు పలు ప్రాంతాలను పరిశీలించి పారిశుధ్యం మెరుగ్గా ఉండాలని సూచించారు. సీజనల్ వ్యాధులు దరిచేరకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలన్నారు. ఆర్డీఓ వెంట ఎంపీఓ సుదర్శన్ తదితరులున్నారు.

స్మితా సబర్వాల్ దివ్యాంగులకు క్షమాపణ చెప్పాలి

మంథని: దివ్యాంగులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ క్షమాపణ చెప్పాలని దివ్యాంగుల నెట్‌వర్క్ జిల్లా కన్వీనర్ ఇనుముల సతీశ్ డిమాండ్ చేశారు. మంథని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం నాయకులు శ్రీనివాస్, సురేశ్, ఈశ్వరాచారి ఉన్నారు.

కాంట్రాక్టు కార్మికునికి గాయాలు

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–3 పరిధిలోని ఓసీపీ–1లో గురువారం కాంట్రాక్టు కార్మికునికి గాయాలయ్యాయి. ప్రాజెక్టు ఓబీ ప్రాంతంలో ఎక్స్‌ప్లోజివ్ ఎస్‌ఎంఈ లిక్విడ్ పైపు ద్వారా డ్రిల్లింగ్ రంధ్రంలో నింపుతుండగా గ్యాలరీ కింది భాగం నుంచి వేడి మంటతో కూడిన పొగ ఒకేసారి పైకి రావడంతో ఎక్స్‌ప్లోజివ్ నింపుతున్న శ్రీకాంత్‌కు ముఖానికి గాయాలయ్యాయి. కరీంనగర్ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పెద్ద ప్రమాదం ఏమీ లేదని అధికారులు పేర్కొన్నారు.

మెడికల్ చెకప్‌లు కార్మికుల మరణానికి దారి తీస్తున్నాయి

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం కాంట్రాక్టు కార్మికుల మరణాలు యాజమాన్య హత్యలే అని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్, ఎన్టీపీసీ క్యాజువల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు రెడ్డపాక శంకర్ గురువారం ఒక ప్రకటనలో యాజమాన్యం తీరును ఖండించారు. యాజమాన్యం చేపట్టిన కాంట్రాక్ట్ కార్మికుల మెడికల్ చెకప్‌లు కార్మికుల మరణాలకు దారి తీస్తున్నాయని ఆరోపించారు. వైద్య పరీక్షల పేరుతో కార్మికులను తొలగించే ప్రక్రియ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు న్యాయం చేయని క్రమంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పోరాటాలు, ఆందోళనలు తప్పవని హెచ్చరించారు.

లేబర్ కార్డులను సద్వినియోగం చేసుకోండి

మంథని: కార్మికశాఖ ద్వారా ప్రభుత్వం జారీ చేస్తున్న లేబర్ కార్డులను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని మంథని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ దుబాసి రవీందర్ కోరారు. లేబర్ కార్డు సేవలపై మధ్యవర్తులను సంప్రదించకుండా నేరుగా కార్యాలయానికి వచ్చి పొందాలన్నారు.

కాంట్రాక్ట్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

ముత్తారం: ముత్తారం కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న అటెండర్, ఆఫీస్ సబార్డినేటర్ పోస్టులకు కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియామకానికి అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి మండల విద్యాధికారి డి.లక్ష్మి తెలిపారు. ముత్తారం స్థానికులై, పదో తరగతి ఉత్తీర్ణతతో 18ఏళ్లు నిండిన మహిళలు 31వ తేదీలోపు ముత్తారంలోని ఎంఆర్‌సీ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

గురుకులంలో స్పాట్ అడ్మిషన్లు

సుల్తానాబాద్: 2024–25 విద్యా సంవత్సరానికి సుల్తానాబాద్‌లోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల విద్యాలయం ఇంటర్ మొదటి సంవత్సరంలో స్పాట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తులు స్వీకరించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ దేవేందర్‌రెడ్డి తెలిపారు. సుల్తానాబాద్‌లోని బాలుర గురుకుల కళాశాలలో 27న నిర్వహించే స్పాట్ కౌన్సిలింగ్‌కు హాజరుకావాలని సూచించారు.

27న స్పాట్ కౌన్సెలింగ్

మంథని: మంథని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర విద్యాలయంలో 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్ ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో మొదటి సంవత్సరంలో మిగిలిన సీట్ల భర్తీకి ఈ నెల 27న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనాథ్ తెలిపారు. సుల్తానాబాద్‌లోని బాలుర గురుకుల కళాశాలలో స్పాట్ కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని పేర్కొన్నారు.

కాంగ్రెస్ దళితులను మోసం చేసింది

గోదావరిఖనిటౌన్: రాష్ట్ర ప్రభుత్వం గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఎన్నికలకు ముందు దళితులకు ఇచ్చిన హామీని మరిచి మోసం చేసిందని దళిత సామాజిక హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు చిలుక ప్రసాద్ ఆరోపించారు. స్థానిక ప్రధాన చౌరస్తా బీఆర్‌ఎస్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.

డీఎస్సీ పరీక్షకు 467 మంది హాజరు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో గురువారం నిర్వహించిన డీఎస్సీ పరీక్షకు 467 మంది అభ్యర్థులు హాజరయ్యారని డీఈఓ మాధవి తెలిపారు. మంథని జేఎన్‌టీయూలో 200 మందికి 169మంది, పెద్దపల్లి మదర్‌థెరిస్సాలో 169మందికి 141మంది, ట్రినిటి ఇంజినీరింగ్ కాలేజీలో 180మందికి 157మంది అభ్యర్థులు హాజరైనట్లు వివరించారు. ప్రతీ పరీక్షా కేంద్రంలో పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశామన్నారు.

31న ధర్నా విజయవంతం చేయాలి

పెద్దపల్లిరూరల్: మధ్యాహ్న భోజన కార్మికుల ప్రధాన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 31న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని మధ్యాహ్న భోజన వర్కర్ల సంఘం నాయకుడు రమేశ్ కోరారు. ఈనెల31న ఇందిరాపార్క్ ఎదుట జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నిధులు కేటాయించాలని నిరసన

గోదావరిఖని: కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి నిధులు కేటాయించాలని కోరుతూ గురువారం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో స్థానిక తిలక్‌నగర్ సెంటర్‌లో నిరసన తెలిపారు. నాయకులు ఈదునూరి రామకృష్ణ, ఈసంపల్లి రాజేందర్, మల్లేశ్, స్వామి, భూషణం, ప్రసాద్, శేఖర్, దేవయ్య పాల్గొన్నారు.

బదిలీ టీచర్లకు సన్మానం

రామగుండం: పట్టణంలోని అయోధ్యనగర్‌లో ఎంపీపీఎస్ బీ–థర్మల్ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులు బదిలీపై అయ్యారు. కాగా స్థానిక కార్పొరేటర్ కౌశిక లత ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు కవితాదేవి, శాంతను సన్మానించారు. బదిలీపై వెళ్తున్న టీచర్లు తమ గుర్తింపుగా పాఠశాలకు వైఫై స్పీకర్ బహూకరించారు.

మహాసభలను విజయవంతం చేయాలి

జ్యోతినగర్: గోదావరిఖని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో 28న జరిగే జిల్లా 7వ మహాసభలను జయప్రదం చేయాలని ప్రగతి శీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు కోడిపుంజుల జ్యోతి కోరారు. ఎన్టీపీసీ రామగుండం ఆటోనగర్ ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు.

నల్లనేలను హరితవనంగా మార్చుకుందాం



మొక్క నాటుతున్న ఆర్డీవో హనుమానాయక్, జీఎంలు రాధాకృష్ణ, వెంకటేశ్వర్లు

రామగిరి: 'అందరం మొక్కలు నాటి సింగరేణి నల్లనేలను హరిత వనంగా మార్చుకుందాం' అని మంథని ఆర్డీవో వి.హనుమానాయక్, ఆర్జీ–3, ఏపీఏ జీఎంలు ఎన్.రాధాకృష్ణ, కొప్పుల వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఆర్జీ–3 పరిధిలోని సెంటనరీకాలనీ ఎస్.టీ.పీ. ప్లాంట్ ఆవరణలో గురువారం వృక్షారోహణ్ అభియాన్, వనమహోత్సవం నిర్వహించగా ఆర్డీవో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ మొక్కలు పెంచాలని ప్రతిజ్ఞ చేశారు. గతేడాది 14వేల హెక్టార్ల విస్తీర్ణంలో సుమారు 7కోట్ల మొక్కలు నాటామని, ఈ ఏడాది సింగరేణివ్యాప్తంగా 25లక్షల మొక్కలు నాటాలనే సంకల్పంతో 7లక్షల మొక్కలు నాటినట్లు వెల్లడించారు. పర్యావరణ పరిరక్షణకు సమష్టిగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ ఎం.ఆర్‌సీ రెడ్డి, ఐఎన్‌టీయూసీ డివిజన్ వైస్ ప్రెసిడెంట్ కోట రవీందర్‌రెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షుడు సీ.హెచ్.వెంకటరమణ, అధికారులు రఘుపతి, బి.సత్యనారాయణ, బానోత్ కర్ణ, ముప్పిడి రవీందర్‌రెడ్డి, గుర్రం శ్రీహరి, ఎంపీడీవో శైలజారాణి, తహసీల్దార్లు రాంచందర్‌రావు, ఆరీఫుద్దీన్ పాల్గొన్నారు.

ప్రభావిత గ్రామాలకు మొక్కలు పంపిణీ చేస్తాం



మొక్క నాటుతున్న జీఎంలు గురువయ్య, సూర్యనారాయణ

గోదావరిఖని: సింగరేణి ఆధ్వర్యంలో పరిసర, ప్రభావిత గ్రామాలకు ఉచితంగా మొక్కలు పంపిణీ చేస్తామని కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్య, ఆర్జీ–2 జీఎం సూర్యనారాయణ, రెస్క్యూ జీఎం శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఏరియా జీఎం కార్యాలయం ఎదుట గల ఖాళీ ప్రాంతంలో గురువారం వారు మొక్కలు నాటారు. కేంద్ర బొగ్గుగనుల మంత్రిత్వ శాఖ, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు వనమహోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. గనులు, కాలనీలు, కార్యాలయాల్లో ఉచితంగా మొక్కలు పంపిణీ చేస్తామన్నారు. రీజియన్ సేఫ్టీ జీఎం కెహెచ్‌ఎన్ గుప్తా, ప్రాజెక్టు అధికారి మధుసూదన్, ఎస్‌వోటూ జీఎం ఎస్.వెంకటేశ్వర్‌రావ్, డీజీఎం పర్సనల్ డీజీఎం రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్య సేవలు ఆదర్శం



రామగిరి: సన్మానిస్తున్న జీఎం కె.వెంకటేశ్వర్లు

రామగిరి: ఏపీఏ గనికి కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్య చేసిన సేవలు మరువలేనివని, ఆయన చేసిన సేవలను ఆదర్శంగా తీసుకుంటామని జీఎం కొప్పుల వెంకటేశ్వర్లు అన్నారు. కార్పొరేట్ సేఫ్టీ జీఎంగా విధులు నిర్వహిస్తున్న కె.గురువయ్య 31న ఉద్యోగ విరమణ పొందనున్నారు. ఈ సందర్భంగా గురువారం ఏపీఏ గని కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి ఆయనను సన్మానించారు. సంస్థలో 42ఏళ్లుగా గురువయ్య ఎంతో నిబద్ధతతో విధులు నిర్వహించారని, అంకితభావంతో అందించిన సేవలు ఎంతో మందికి ఆదర్శమన్నారు. కార్యక్రమంలో ఆర్జీ రీజియన్ సేఫ్టీ జీఎం కె.హెచ్.ఎన్.గుప్తా, ప్రాజెక్టు అధికారి కె.నాగేశ్వర్‌రావు, ఎస్‌వోటూ జీఎం బి.సత్యనారాయణ, ప్రాజెక్టు ఇంజినీర్ టి.రఘురాం, అధికారులు కె.జనార్దన్, తిరుపతి, రవిచంద్ర, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

కార్పొరేట్ సేఫ్టీ జీఎంకు సన్మానం

గోదావరిఖని: ఈనెలాఖరున ఉద్యోగ విరమణ పొందనున్న కార్పొరేట్ సేఫ్టీ జీఎం కె.గురువయ్యను రెస్క్యూ ప్రధాన కార్యాలయంలో గురువారం సన్మానించారు. రెస్క్యూ జీఎం శ్రీనివాస్‌రెడ్డి, ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ సన్మానించి జ్ఞాపికను బహూకరించారు. రెస్క్యూ సూపరింటెండెంట్ మాధవరావు, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌ఎంకు నిధులు కేటాయించాలి

రామగుండం: రామగుండంలోని 62.5 మెగావాట్ల సామర్థ్యం గల బీ–థర్మల్ విద్యుత్ కేంద్రంలో ఏర్పడిన సాంకేతిక లోపంతో జూన్ 6న విద్యుత్ ఉత్పత్తి నిలిచింది. ఈనేపథ్యంలో గురువారం తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ యూనియన్–1535 ఆధ్వర్యంలో టీజీ జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ రోనాల్డ్ రాస్‌తో పలు అంశాలపై సుదీర్ఘంగా విన్నవించారు. ముఖ్యంగా కాలం చెల్లిన జాబితాలో ఉన్న బీ–థర్మల్ విద్యుత్ కేంద్రం స్థానంలో నూతనంగా 800 మెగావాట్ల సామర్థ్యం గల నూతన విద్యుత్ కేంద్రం స్థాపించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోగా, అప్పటి వరకు బీ–థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని రెనోవేషన్ అండ్ మోడ్రనైజేషన్ (ఆర్‌అండ్‌ఎం)కు నిధులు కేటాయిస్తే మరికొన్ని ఏళ్ల పాటు తక్కువ ధరతో నాణ్యమైన విద్యుత్ ఉత్పత్తి చేసే అవకాశం ఉంటుందని వివరించారు. కాగా ఇప్పటికే సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సీఈఏ) 2029 వరకు విద్యుత్ కేంద్రాన్ని కొనసాగించేందుకు అవకాశం కల్పించిన విషయాన్ని సీఎండీ దృష్టికి తీసుకువచ్చారు. కాగా ప్రస్తుతం జెన్‌కోలో నిపుణులైన ఇంజినీర్ల బృందం సేవలను వినియోగించుకునే అవకాశం ఉందన్నారు. దీనిపై సీఎండీ సానుకూలంగా స్పందిస్తూ సీఎం, ఆర్థిక మంత్రుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించేందుకు చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. సీఎండీని కలిసిన వారిలో యూనియన్ ప్రతినిధులు రాష్ట్ర ప్రతినిధులు నజీర్, రాధాకృష్ణ, కుమారస్వామి, అబ్దుల్, నర్సింగరావు, విజయ్‌కుమార్, నగేష్, ధనయ్య, నర్సింహారెడ్డి ఉన్నారు.

'క్వార్టర్ డ్యామేజ్ చేస్తే వెకేషన్ సర్టిఫికెట్ ఇవ్వం'

గోదావరిఖని: క్వార్టర్ అప్పగించే సమయంలో షెడ్డు కూల్చివేయడం, అదనపు కట్టడాలను తీసివేసి క్వార్టర్ డ్యామేజీ చేస్తే చర్యలు తీసుకుంటామని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. క్వార్టర్ తీసుకున్న ఉద్యోగులు షెడ్, అదనపు నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. క్వార్టర్ అప్పగించే సమయంలో వాటిని కూలగొట్టడం మూలంగా క్వార్టర్ తీసుకునే కార్మికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈక్రమంలో అలాట్ చేసిన క్వార్టర్‌లో అదనపు నిర్మాణాలు కూల్చివేస్తే అట్టి క్వార్టర్ వెకేషన్ సర్టిఫికెట్ ఇవ్వబోమని పేర్కొన్నారు.

800 మంది విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



నోట్‌బుక్స్ అందిస్తున్న ఇంద్రకరణ్‌రెడ్డి దంపతులు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని 32 ప్రాథమిక పాఠశాలలకు చెందిన 800 మంది విద్యార్థులకు రూ.50వేల విలువ గల నోట్‌బుక్స్, పెన్సిల్లు, పెన్నులు విద్యాసామగ్రి అందించారు. గుండెపోటుతో మృతిచెందిన పులి నాగమణిరెడ్డి జ్ఞాపకార్థం ఆమె తనయుడు కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులి ఇంద్రకరణ్‌రెడ్డి, మౌనికారెడ్డి దంపతులు గురువారం విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మొట్లపల్లి మాజీ సర్పంచ్ తులా మనోహర్‌రావు, మత్స్యపారిశ్రామిక సంఘం అధ్యక్షుడు రానవేన శ్రీనివాస్, నాయకులు పాల రాజేశం, కారుపాకల రమేశ్, జంపయ్య, పులి ఇంద్రకరణ్‌రెడ్డి సైన్యం పాల్గొన్నారు.

ఆర్‌ఎఫ్‌సీఎల్ కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నారు

జ్యోతినగర్: రామగుండం ఎరువుల కర్మాగారంలో విధులు నిర్వహిస్తున్న కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నారని కాంట్రాక్టు కార్మికుల సంఘం (ఐఎఫ్‌టీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుక శంకర్ ఆరోపించారు. ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని కేంద్ర కార్మికశాఖ కార్యాలయంలో గురువారం లేబర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారికి వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ రామగుండం ఎరువుల కర్మాగారంలో కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్న కార్మికులకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. యాజమాన్యం, కాంట్రాక్టర్‌తో చర్చించి కార్మికులకు తగిన న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు నరేశ్, బ్రాంచ్ నాయకులు తిప్పని రాంకీ, రూపేశ్, శ్రీకాంత్, రాకేశ్, ప్రవీణ్ ఉన్నారు.

శిక్షసప్తాహ్ సాంస్కృతిక దినోత్సవం

ముత్తారం: మండలంలోని పోతారం ప్రాథమిక పాఠశాలలో గురువారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన శిక్ష సప్తాహ్ సాంస్కృతిక దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులతో బతుకమ్మ ఆడుతూ ఆ పండుగ విశిష్టత తెలిపేలా ప్రదర్శన చేయించారు.